చెరువులను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువులు కబ్జాకు గురై అన్యాక్రాంతం అవుతున్నాయని.. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లలో, నాలాలను కబ్జా చేసి స్థిర నివాసాలు ఏర్పర్చడం వల్ల భూగర్భ జలాలు ఆవిరవుతున్నాయని వాటిని కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్‌లోని మైసమ్మ చెరువును మండల రెవెన్యూ అధికారి స్వామి, నీటి పారుదల శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లేశంతో కలిసి బండి రమేష్ పరిశీలించి చెరువు ప్రాంతం కబ్జాకు గురయిందని గుర్తించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి బౌండరీలను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కబ్జాలో ఉన్న ఎలాంటి వారినైనా నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తామని తెలిపారు.

అయోధ్య రామ్‌లల్లా దర్శనానికి ప్రత్యేక రైళ్లు

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్‌లోని బీజేపీ నాయకులు, రామభక్తులు ఉప్పల చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో అయోధ్య రామ్‌లల్లా దర్శనం కోసం బయలుదేరుతున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల జనవరి 22న నెరవేరిందన్నారు. రామ్‌లల్లా దర్శనానికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. జై శ్రీరామ్ అంటూ భక్తులతో నినదించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, సీనియర్ నాయకులు డాకయ్య, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయి, బీజేపీ నాయకులు, రామభక్తులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సూచన మేరకు శుక్రవారం నాయకులు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్‌లు వివేకానందనగర్ డివిజన్‌లోని బాగ్ అమీర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి వారితో కలిసి సహపంక్తిలో పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పలు పాఠశాలలో నిర్వహణ లోపం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. పాఠశాలలో గుర్తించిన సమస్యలను ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గణేష్ గౌడ్, దయాకర్‌రెడ్డి, మార్ల శ్రీను, శ్రీను, శృతిగౌడ్ పాల్గొన్నారు.

వాహనం నడపడం మహిళా సాధికారతకి చిహ్నం

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ



మూసాపేట: యువతులు, మహిళలు ద్విచక్ర వాహనం నడపటం మహిళా సాధికారతకి ఒక చిహ్నం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.అలివేలు మంగమ్మ అన్నారు. ఎంటడబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులకు ఉచితంగా ద్విచక్ర వాహనం నేర్పడానికి ముందుకొచ్చిన సంస్థ ప్రతినిధులు జయభారతి, శుభ్ర, స్వప్నలను వైస్ ప్రిన్సిపాల్ డా. బి.భవాని అభినందించారు. ప్రతి సంవత్సరం విద్యార్థినులకు ఉచితంగా శిక్షణ నిస్తామని ఎంటడబ్ల్యూ సంస్థ, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఐ. వాణి అన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, డా. ఆర్.కరుణ, డా. ఆర్.శోభ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సెయింట్ మార్టిన్ విద్యార్థులు

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థుల బృందం 2022–2023 విద్యా సంవత్సరానికి సంబంధించి 'వర్ధుసా జటాయు సీజన్–3 ఐడియా థాన్'లో విజయం సాధించింది. దేశవ్యాప్తంగా వేలాది టీమ్‌లు పాల్గొన్న ఈ ఈవెంట్‌లో కళాశాల విద్యార్థులు మేరీ పౌలినా, చిప్పల చిన్మయి, మీరిపెల్లి సంజన, పల్లెమీడి విహారిలు ఎల్ఎంఎం, ఎన్ఎల్‌పీ, వంటి అధునాత సాంకేతికతను ఉపయోగించి హెల్త్ కేర్ ఏ1 చాట్‌బాట్ అనే వినూత్న ప్రాజెక్ట్‌ను రూపొందించారు. దీనికి గాను విద్యార్థులకు ప్రశంస పత్రంతో పాటు వెయ్యి యూఎస్ డాలర్ల నగదు పురస్కారం అదే విధంగా రూ.6.5 లక్షల ఉద్యోగ అకకాశం లభించింది. జటాయి సీజన్–3 ఐడియా థాన్‌లో విజయం సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాల డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా, యాజమాన్యం అభినందించారు.

డివిజన్ల సమస్యలపై గళం విప్పిన కార్పొరేటర్లు



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో శుక్రవారం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... కేపీహెచ్‌బీ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన వవరాలు సమర్పించారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకున్నామని, పలు సీసీ రోడ్లు, నీటి పైపులైన్లు, అనేక పార్కులు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్‌సీకి వినతిపత్రం అందజేశారు.

◆ అనంతరం నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా సీవరేజ్ వ్యవస్థ, రోడ్లు, లింక్ రోడ్లు, చెరువులు సుందరీకరణ, శ్మశానవాటికల అభివృద్ధి, పార్కుల అభివృద్ధి, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వంటి పలు అంశాలపై జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించారు. హైదర్‌నగర్ అభివృద్ధిలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టరు సహకరించాలన్నారు. డివిజన్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వ్యాపార దృక్పథంతో కాకుండా, సామాజిక దృక్పథంతో పనిచేయాలని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని పనిచేసే వారికే పనులను అప్పగించాలని జెడ్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక వసతుల కల్పనకు జీహెచ్‌యంసి నిధులు మంజూరు చేసినా పనులను ఆలస్యం చేయటంలో అర్థం లేదన్నారు. వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

◆ అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా అభివృద్ధి చేయాలన్నారు. రామారావునగర్ నాలా పనులు రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని త్వరగా పూర్తి చేయాలన్నారు. కేఎస్‌నగర్, రాణాప్రతాప్ నగర్, గాయత్రినగర్ బస్తీలు రైల్వేట్రాక్ పక్కన ఉన్నందున ప్రజలు రైల్వేట్రాక్‌పై దాటి వెళ్లే అవకాశం ఉండటం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని జెడ్‌సీ దృష్టికి తీసుకొచ్చారు.

◆ యూసఫ్‌నగర్ హిందూ శ్మశానవాటిక అధునాత వసతులతో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. రాజీవ్‌గాంధీ నగర్ ముస్లిం గ్రేవ్‌యార్డ్ అభివృద్ధి చేయాలన్నారు. సఫాయి కార్మికులను పెంచాలన్నారు. విద్యుత్, బోర్‌వెల్ సమస్యలు ఉన్నాయన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ బస్తీల్లో పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయని వెంటనే పాడైపోయిన వాటిని సరిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, ఇతర నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీలు, హెచ్‌ఓడీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రశాంతినగర్ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఘనంగా క్రీడోత్సవాలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో క్రీడా వారోత్సవాలు శుక్రవారం స్థానిక రమ్యాగ్రౌండ్‌లో జరిగాయి. వారం రోజులుగా జరిగిన ఈ పోటీల్లో క్రికెట్, ఖోఖో, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్, విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. మహిళా క్రికెట్ పోటీల్లో భవాని సారథ్యంలోని బీకాం ఫైనల్ ఇయర్ జట్లు విజేతగా నిలవగా, దేవి సారథ్యంలోని బీఎస్సీ మొదటి సంవత్సరం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని తెలిపారు. ఇతర కళాశాలల్లో జరగని విధంగా ప్రగతి కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు సైతం ప్రత్యేకంగా క్రికెట్ పోటీలను సైతం నిర్వహించి పోత్సహిస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో జనతానగర్‌లో ఉచితంగా కుట్టు మెషిన్ శిక్షణ పొందిన మహిళలకు మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎమ్మెల్యే ధవరం కృష్ణారావు ఖార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచతంగా కుట్టు మెషిన్‌లో శిక్షణ అందిస్తున్నారన్నారు. ఇందులో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ మహిళలకు తన సొంత ఖర్చులతో మెషిన్లను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, తుకారాం, రవిసింగ్, మనోజ్, అక్బర్, దస్తగిరి, అరుణ్, నర్సింగ్, రమేష్, వినోద్, రవి, హరిత, రమాదేవి, శాంత, సంధ్య, శివాని, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 3వ ఫేజులోని రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, వారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించే విధంగా వివిధ ప్రయోగాలను విద్యార్థులు తయారు చేశారు. ఆ ప్రయోగాల విధానాలు, పద్ధతులు, చర్యలు వంటి అంశాలు వీక్షకులను అబ్బుర పరిచే విధంగా ఉన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో మొత్తం 400కు పైగా నమూనాలను ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయురాలు శిరీష పేర్కొన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయిన డీన్ శ్రీలత పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్మికులకు ఐడీ కార్డులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ ప్రగతినగర్‌లో శ్రీభవాని శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆస్‌బెస్టాస్ కాలనీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొని కార్మికులకు ఐడీ కార్డులు అందజేశారు.

13 నుంచి బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి 53వ బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. 13వ తేదీన సుప్రభాతం, విష్వసేకాధారణ, స్వస్తివాచనం, పుణ్యవాచనం, రక్షాబంధనం, 14వ తేదీన హోమం, ధ్వజారోహణ, స్వామి వారి కల్యాణం, అన్నదానం, 15వ తేదిన పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

కూకట్‌పల్లి: దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జేఎన్‌టీయూ ప్రగతినగర్ ఆటో స్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బంద్‌కు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16న జరిగే భారత్ బంద్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ పభుత్వం కార్మిక ప్రజా రైతు వ్యతిరే విధానాలను తీసుకొచ్చి పెను భారం మోపిందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఇటువంటి అనేక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

బాలానగర్: బాలానగర్‌లోని పారిశ్రామిక ప్రాంతంలో దేశ వ్యాప్త గ్రామీణ బంద్ పట్టణ ప్రాంతాల్లో సెక్టోరియల్ సమ్మెను జయప్రదం చేయాలని.., బంద్‌కు సంబంధించిన గోడపత్రాన్ని సీఐటీయూ మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరంకుశ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరారు.

నేడు జేఎన్‌టీయూహెచ్‌లో ఒకరోజు సదస్సు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో గోల్డెన్ జూబ్లీ సెమినార్‌హాల్‌లో డైరెక్టరేట్ ఆఫ్ ఇంటర్న్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ డా. ఆర్. శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం ఒక రోజు సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సదరస్సులో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి, యూనివర్సిటికి నూతనంగా నియమించబడిన రెక్టార్ కె. విజయకుమార్‌రెడ్డి, యూనివర్సిటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, డా. జ్యోతి పాల్గొనున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూ విభాగాధిపతులకు శుభాకాంక్షలు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లోని హెచ్ఆర్‌డీసీ యూజీసీ విభాగాధిపతిగా ప్రొ. జీఎన్ శ్రీనివాస్, ప్రిన్సిపల్‌గా ప్రొ. నర్సింహారెడ్డి నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి మాట్లాడుతూ నూతన పదవీ బాధ్యతలు స్వీకరించిన విభాగాధిపతులు విద్యార్థులకు యూజీసీ ప్రోత్సాహకాల పట్ల అవగాహన పరుస్తూ, సమాజంలోని అవసరాలకు అనుగుణంగా అధునాతన శాస్త్ర సాంకేతిక విద్య అందించేందుకు వారధిగా ఉంటూ.. ఆచార్యులకు నూతన విద్యా విధానం గురించి ఎప్పటికప్పుడు శిక్షణను ఇచ్చి గుణాత్మకమైన మార్పుకు కృషి చేయాలన్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై సకాలంలో స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురష్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ అలయంలో పెద్ద ఎత్తున పూజలు, హోమాలు నిర్వహించారు. చైర్మన్ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన హోమంలో మక్కాల సత్యనారాయణ పాల్గొని హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలయం అవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వేడుకలో రిటైల్ కోతిమీర్ అశోక్, రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్, కార్యదర్శి మక్కాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.